# అద్దె సైకిల్

విస్తర్లో అన్నం వడ్డించి భోజనానికి పిలిచింది కాత్యాయని.

అప్పటికే అపరాహ్నవేళ మించిపోయింది.

భార్య పిలుపుకు 'ఊఁ' అంటున్నాడే తప్ప లేచి తిండి తిందామనిపించడంలేదు విశ్వనాథానికి. అతడి మనసంతా గజిబిజిగా ఉంది. అందుక్కారణం ఆరోజు జరిగిన అనూహ్య సంఘటనే అని చెప్పాలి. రెండు గంటల్లో వచ్చేస్తానన్న ప్రకాశం నాలుగు గంటలు దాటినా పికర్లేదు. ఎవర్ననుకుని ఏం లాభం? ముక్కు మోహం తెలియని వ్యక్తిని గుడ్డిగా నమ్మడం తనదే బుద్ధి తక్కువ. రకరకాల ఆలోచనలు అతడి మస్తిష్కాన్ని కుమ్మరి పురుగులా దొలిచేస్తున్నాయి. మాటి మాటికి ఉదయం జరిగిన సంఘటనే కళ్ళ ముందు కదలాడసాగింది.

• • •

"నమస్కారం మాష్టారూ!" చేతులు జోడించి నిలబడ్డాడో యువకుడు.

వీధి వరండాలో వాలు కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్న విశ్వనాథం తలపై కెత్తి చూశాడు.

అతడికి సుమారు పాతికేళ్ళుంటాయి. సన్నగా, పొడవుగా ఉన్నాడు. విలువైన వలువలు ధరించాడు. మాటల్లో సంస్కారం, చూపుల్లో వినయం ఉట్టిపడుతోంది.

"నువ్వు...."

"ఐతే నన్ను పూర్తిగా మరచిపోయారన్న మాట నన్ను ప్రకాశం అంటారు. మీ శిష్యుణ్ణి మాష్టారూ" తన్నుతాను పరిచయం చేసుకున్నాడు ఆ కుర్రవాడు.

గుర్తు తెచ్చుకోడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు విశ్వనాథం తను ముప్పై

"సరే, పదనాయనా! అప్పారావుతో చెప్పి సైకిలు అద్దెకిప్పిస్తాన్లే" అంటూ కుర్చీలోంచి లేచాడు విశ్వనాథం.

"థాంక్స్ మాష్టారూ! రెండు గంటలలో తిరిగొచ్చేస్తాను" అంటూ సైకిలెక్కి తుర్రుమన్నాడా కుర్రవాడు.

• • •

ప్రకాశం వెళ్ళి నాలుగు గంటలు దాటింది. అతడెంతకూ తిరిగి రాకపోయేసరికి విశ్వనాథం అంతరంగ కడలిలో ఉవ్వెత్తున ఆలోచనా తరంగాలు ఎగిసి పడుతున్నాయి. అనుమానపు పొరలు ఆవరించుకుంటున్నాయి. కొంపతీసి వాడు దొంగ కాదు కదా?! సైకిలు ఇప్పించలేనని నిర్మొహమాటంగా ఒక్క ముక్క చెప్పి ఉంటే తనకిప్పుడీ అవస్థ ఉండేది కాదు. కేవలం తన అనుమానం తప్ప ఆ అబ్బాయిని చూస్తే ఎవ్వరూ దొంగ అనుకోలేరు.

"ఇప్పుడేమనుకుని ఏం లాభం? సైకిలు ఇప్పించినప్పుడుండాలి ఆ బుద్ధి" ఎద్దేవా చేస్తున్నట్లు అన్నది భర్త అంతరంగాన్ని అర్థం చేసుకున్న కాత్యాయని.

అర్ధాంగి దెప్పి పొడుపుకు పుండుమీద కారం చల్లినట్లైంది.

"ఇప్పుడే వస్తానుండు, ఒకవేళ ఆ అబ్బాయి అప్పారావుకి సైకిలు అప్పజెప్పేసి వెళ్ళి పోయాడేమో" అంటూ లేచి పంచె సరి చేసుకున్నాడు విశ్వనాథం.

గాఢంగా నిట్టూరుస్తూ లోనికెళ్ళి పోయింది కాత్యాయని.

సైకిలు షాపు వద్ద కెళ్లాడేగాని అప్పారావుని అడగటానికి మనసు తటపటాయిస్తోంది. ముక్కూ మొహం తెలియని వ్యక్తికి సైకిలు ఇప్పించిన తన తెలివి తక్కువతనానికి నవ్వుకుంటాడేమోనని పించింది.

విశ్వనాథం ఎదలో చెలరేగుతున్న అలజడితో ప్రమేయం లేని అప్పారావు "ఏం బాబూ! వచ్చారు?" అంటూ ప్రశ్నించారు.

"అబ్బే! ఏం లేదు. ఉదయం మా ప్రకాశం సైకిలు పట్టుకెళ్ళాడు కదా!...." నీళ్ళు నమిలాడు విశ్వనాథం.

ఇంకా రాలేదు బాబూ!"

"రెండు గంటల్లో వచ్చేస్తానన్నాడే!"

"ఏ పని పడిందో ఏమో వస్తార్లెండి" అంటూ సైకిలు ట్యూబుకి పేచ్ వెయ్యడంలో నిమగ్నమయ్యాడు అప్పారావు.

తనకున్న కంగారు వాడికెందుకుంటుంది? వాడి సైకిలుకి తను హామీ

ఉన్నాడు కదా" అనుకుంటూ గృహోన్ముఖుడయ్యాడు విశ్వనాథం.

సాయంత్రమైనా సైకిలు పట్టుకెళ్ళిన అబ్బాయి అంచుల్లేవు.

ఆశ వదులుకున్నాడు విశ్వనాథం. చేసిన తెలివి తక్కువ పనికి తనని తాను ఎన్నిసార్లు నిందించుకున్నాడో లెఖ్ఖలేదు. దానికి తోడు భార్య దెప్పిపొడుపులు అతడిని మరింత కృంగదీస్తున్నాయి. ఇంకా అతడి కోసం ఎదురు చూడటం శుద్ధ అవివేకమనిపించింది. ఈ పాటికల్లా ఏ ఊరో ఉడాయించి ఉంటాడు అనుకున్నాడు. కకావికలమైపోయిందతడి హృదయం. మర్నాడు అప్పారావుకి ఇచ్చుకోవలసిన వెయ్యి రూపాయల గురించి అన్వేషణ ప్రారంభించాడు.

చీకటి పడుతుండగా చుక్కలా ఊడిపడ్డాడు. ప్రకాశం. అతడిని చూడటంతోనే పోయిన ప్రాణం లేచొచ్చినట్టయింది విశ్వనాథానికి.

"వచ్చావా బాబూ.... రా నాయనా... నీ కోసమే ఎదురు చూస్తున్నాను" అన్నాడు అప్రయత్నంగా.

"క్షమించండి మాష్టారూ! స్నేహితుడి బలవంతం మీద ఇంతవరకు ఉండిపోవలసి వచ్చింది" సంజాయిషీ చెప్పుకున్నాడు ప్రకాశం.

"ఫరవాలేదు. అప్పారావుకి సైక్లిలు ఇచ్చేసావు కదా" ఆత్రంగా అడిగాడు విశ్వనాథం.

"ఇచ్చేసాను మాష్టారూ. మీతో చెప్పి పోదామని వచ్చాను. మీరు చేసిన మేలు మరచిపోలేను" కృతజ్ఞతా భావన అతడి కళ్ళల్లో ఉట్టిపడుతోంది. ఉదయం నుండి అతడిని శంకించి దొంగగా చిత్రించుకున్నందుకు లోలోన బాధ పడ్డాడు విశ్వనాథం. అతడి నిజాయితీకి సంతోషిస్తూ "భలేవాడివే? భోజనం చెయ్యకుండా వెళ్ళిపోదామనుకుంటున్నావా?" అన్నాడు.

"నేను అర్జంటుగా మా ఊరు వెళ్లాలి. మరో పది నిముషాలలో బస్సు ఉందంటున్నారు. నన్ను మరి ఒత్తిడి చేయకండి".

ప్రకాశం మాటలకు "సరే! నీ ఇష్టం" అన్నాడు విశ్వనాథం.

"మీరు నన్ను మనస్ఫూర్తిగా మన్నించాలి. నేను మిమ్మల్ని మోసం చేసాను" అన్నాడు. ప్రకాశం.

"మోసమా?" విస్తుపోతూ కళ్ళు పెద్దవి చేశాడు. విశ్వనాథం.

"ఒక రకంగా మోసమే మాష్టారూ. మీరెవరో నిజంగా నాకు తెలీదు. ఊళ్ళో దిగగానే బూరుగు పాల్లెనికి బస్సులు లేవని తెలిసింది. సైకిలు మీద వెళదామంటే

తెలిసున్న వ్యక్తులెవరైనా చెబితేగాని సైకిలు అద్దెకివ్వనన్నాడు సైకిలు షాపువాడు. నాకీ ఊళ్ళో అంతా అపరిచితులు కావడంతో నేను మీ వద్ద చదూకున్నానని నాటకం ఆడవలసి వచ్చింది. మీరు నా ఎడల అపారమైన విశ్వాసంతో సైకిలు ఇప్పించి, నడచి వెళ్ళవలసిన దుస్థితిని తప్పించారు. మీ మేలు ఈ జన్మలో మరచిపోలేను."

"అది సరే, మరి నాగురించి అన్ని వివరాలు ఎలా చెప్పగలిగావు?" అదుర్దాగా ఎదురు ప్రశ్నవేశాడు విశ్వనాథం అతడి మంచితనానికి లోలోన అభినందిస్తూ.

"బయట మీ నేమ్ బోర్డు చూశాను. టి. విశ్వనాథం. రిటైర్డ్ మేథ్స్ టీచర్ అని ఉంది. శిష్యులు గురువులను గుర్తుపెట్టుకున్నంత సులువుగా గురువులు శిష్యుల్ని గుర్తుపెట్టుకోలేరు. అందుకే నేను మీ స్టూడెంటునని బొంకాను. అవసరం నాచేత అలా అబద్ధం చెప్పించిందే తప్ప మిమ్మల్ని మోసం చెయ్యాలని కాదు. నన్ను హృదయపూర్వకంగా మన్నించి సెలవిప్పించండి" విశ్వనాథం మాష్టారి చేతులు పట్టుకుని వేడుకున్నాడు ప్రకాశం.

అప్రయత్నంగా మాష్టారి కనుకొలుకుల నుండి జాలువారిన అశ్రు బిందువులు ప్రకాశం చేతుల మీద పడి ముత్యాల్లా మెరిసాయి.

● *ఆంధ్రప్రభ వీక్లీ, 7–8–91* ●